# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఉగ్రవాదం, హింస లేని వాతావరణంలో మాత్రమే పాకిస్థాన్‌తో సంబంధాలు ముందుకు సాగగలవని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది.
- పటిష్టమైన, సుస్థిరమైన విద్యా వ్యవస్థలను నిర్మించడానికి బ్రిక్స్ దేశాల మధ్య బలమైన సహకారం అవసరమని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు.
- రైల్వేలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్.. ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధాన సాధనంగా ఉపయోగిస్తోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వక సమాధానమిస్తూ.. ఉగ్రవాదం, హింస లేని వాతావరణంలో మాత్రమే పాకిస్థాన్‌తో సంబంధాలు ముందుకు సాగగలవని స్పష్టం చేశారు. పుల్వామా ఉగ్రదాడి అనంతరం, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అటారీ చెక్‌పోస్ట్‌ను మూసివేయడం, వీసాలపై ఆంక్షలు విధించడం వంటి అనేక దౌత్యపరమైన చర్యలను భారత్ తీసుకుందని చెప్పారు. పాకిస్థాన్‌కు ఇచ్చిన అత్యంత ప్రాధాన్య దేశం హోదాను భారత్ ఉపసంహరించుకుందని, అలాగే.. పాకిస్థాన్ నుండి వచ్చే లేదా ఎగుమతి అయ్యే అన్ని వస్తువుల మీద కస్టమ్స్ సుంకాన్ని 200 శాతానికి పెంచిందని కేంద్రమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (MSME) అభివృద్ధి సవరణ బిల్లు-2026 కు పార్లమెంట్ ఆమోదం లభించిందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంటు ఆవరణలో ఈరోజు విలేకరులతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల గందరగోళం, నినాదాల కారణంగా ఉభయ సభలలోనూ చర్చలకు పరిమిత అవకాశం లభించిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభలో మాట్లాడాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌పై స్పందిస్తూ... సభాపతి ఆమోదంతో ఏ మంత్రి ఏ అంశంపై స్పందించాలనేది ప్రభుత్వమే నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రత్యేక సమావేశం ద్వారా వర్షాకాల సమావేశాలను పొడిగించే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని కిరణ్ రిజిజు తెలియజేస్తూ...

(వాయిస్ 21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పటిష్టమైన, సుస్థిరమైన విద్యా వ్యవస్థలను నిర్మించడానికి బ్రిక్స్ దేశాల మధ్య బలమైన సహకారం ఆవశ్యకమని కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. భువనేశ్వర్‌లో ఈరోజు జరిగిన 13వ బ్రిక్స్ విద్యా మంత్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆర్థిక అనిశ్చితులు, వాతావరణ మార్పులు వంటి ప్రపంచ సవాళ్లకు సమర్థవంతంగా స్పందించేలా విద్యా వ్యవస్థలు సన్నద్ధం కావాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా మానవత్వమే ప్రథమం అనే స్ఫూర్తితో బ్రిక్స్ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కృషి చేస్తోందని, గ్లోబల్ సౌత్ ఆకాంక్షలను నెరవేరుస్తూనే.. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడానికి భారతదేశం కట్టుబడి ఉందని ప్రహ్లాద్ జోషి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రైల్వేలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో ఈ రోజు ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... గత కొన్నేళ్లుగా అమలు చేసిన పలు భద్రతా చర్యల ఫలితంగా రైలు పట్టాలు తప్పడం వంటి ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. 2014-15లో 135గా ఉన్న తీవ్రమైన రైలు ప్రమాదాల సంఖ్య, 2026-27 నాటికి రెండుకు తగ్గిందని చెప్పారు. గత 5 ఆర్థిక సంవత్సరాల్లో భద్రతకు సంబంధించిన పనుల కోసం 5 లక్షల 41 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామన్నారు. భారతీయ రైల్వే ప్రతి సంవత్సరం ప్రయాణికులకు సుమారు 58 కోట్ల భోజనాలను అందిస్తోందని, ఆహార నాణ్యతకు సంబంధించి అతి తక్కువ ఫిర్యాదులు నమోదయ్యాయని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో కొత్తగా చేరిన పలువురు పార్లమెంట్ సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు తన నివాసంలో అల్పాహార విందులో పాల్గొన్నారు. అనంతరం శివసేన ఎంపీ జ్యోతి సావిత్రి నాగ్నాథ్ వాఘ్మారే విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో పదే పదే జరుగుతున్న అంతరాయాలపై నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. కొత్తగా ఎన్నికైన ప్రతిభావంతులైన ఎంపీలు సభలో తమ అభిప్రాయాలను వెల్లడించకుండా అంతరాయాలు కలుగుతున్నాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించినట్టు ఆమె చెప్పారు. దేశ నిర్మాణానికి ఏం చేయాలో, ఎంపీలు ఎలా సమర్థవంతంగా తోడ్పడగలరో ప్రధానమంత్రి వివరించారని ఎన్‌సిపిఐ ఎంపీ శతాబ్ది రాయ్ తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిపాదిత విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై అమెరికా చట్టసభ సభ్యుడు లేవనెత్తిన అభ్యంతరాలను భారత్ తోసిపుచ్చింది. విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని తెలిపారు. చట్టపరమైన అంశాలు తమ అంతర్గత వ్యవహారాలని, వాటిపై నిర్ణయాలు పార్లమెంటు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అమెరికాతో సహా అనేక దేశాలు విదేశీ నిధులను నియంత్రిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేస్తూ...

(వాయిస్ 16 సెకన్లు)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ గురించి ఆయన మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, పరిణామాలపై ఇద్దరు నాయకులు చర్చించారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ.. దేశంలోని నేత కార్మికులు, కళాకారుల అభివృద్ధికి చేయూత నివ్వాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి పిలుపునిచ్చారు. ఈరోజు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ... భారతదేశ చేనేత.. వస్త్రం మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాలకు, లక్షలాది నేత కుటుంబాల జీవనోపాధికి పునాది అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రజలు తమకు ఇష్టమైన చేనేత ఉత్పత్తులతో కూడిన వీడియోలను పంచుకొని.. జాతీయ చేనేత దినోత్సవ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. `వోకల్ ఫర్ లోకల్` సంకల్పాన్ని బలోపేతం చేయాలని, భారతీయ చేనేత ఉత్పత్తులను స్వీకరించడం ద్వారా కళాకారుల గౌరవాన్ని పెంచాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

క్రీడా వ్యవస్థలో సంస్థాగత సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయా పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన "నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ కాన్‌క్లేవ్-2026"లో ఆయన మాట్లాడుతూ... క్రీడాకారుల ప్రయోజనాలు, సంక్షేమం ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలన్నారు. ఏ క్రీడాకారుడూ అన్యాయానికి గురికాకూడదని స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, నిష్పక్షపాతాన్ని, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి, బహిరంగ ట్రయల్స్‌ను కెమెరాలలో రికార్డ్ చేయాలని ఆయన సూచించారు. దేశ స్వదేశీ కోచింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, విదేశీ కోచ్‌లపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించాలని కేంద్రమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలో జరుగుతున్న గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ రాపిడ్, బ్లిట్జ్ టైటిల్ లను భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద కైవసం చేసుకున్నారు. 20 ఏళ్ల ప్రజ్ఞానంద.. సెమీ-ఫైనల్ రౌండ్‌లో ఉజ్బెకిస్తాన్ గ్రాండ్ మాస్టర్ జవోఖిర్ సిందరోవ్‌తో డ్రా చేసి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్ ఆద్యంతం ప్రజ్ఞానంద తన ఆధిక్యాన్ని కొనసాగించారు. అంతకుముందు, ఓస్లోలో జరిగిన నార్వే చెస్-2026 టోర్నమెంట్‌లో చివరి రౌండ్‌లో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించి ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్ విదిషా జిల్లాలోని కక్రౌవా గ్రామానికి చెందిన కొందరు విద్యార్థులు, బేత్వా నది చెక్ డ్యామ్ స్తంభాలపై దూకుతూ పాఠశాలకు వెళుతున్నారంటూ మీడియాలో వచ్చిన కథనంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) స్పందించింది. ఆ కథనంలోని అంశాలు నిజమైతే.. అవి మానవ హక్కుల ఉల్లంఘునకు సంబంధించినవని కమిషన్ అభిప్రాయపడింది. 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 21A హామీ ఇస్తుందని, అలాగే.. విద్యా హక్కులో సురక్షితమైన పాఠశాల, మౌలిక సదుపాయాలను పొందే హక్కు కూడా అంతర్భాగంగా ఉంటుందని కమిషన్ పేర్కొంది. ఈ విషయంపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని NHRC ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =